క్లుప్తంగా

250 మందికి వైద్య సేవలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా రవాణా అధికారి శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: వాసవీ క్లబ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించి వాసవీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. 250 మంది రోగులకు క్యాన్సర్, గ్యాస్ట్రో, కంటి తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అమలాపురం మెడ్ యునైటెడ్, రాజమహేంద్రవరం మాక్సీ విజన్ హాస్పటల్ సంయుక్త సహకారంతో వైద్యులు సేవలు అందించారు. వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ యెండూరి రాఘవకుమారి పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో క్లబ్ ప్రతినిధులు బచ్చు పార్వతీదేవి, పచ్చిగోళ్ల సుధ, తటవర్తి ప్రసాద్, వేమన నరసింహమూర్తి, అమలాపురం వైశ్య సంఘం ప్రతినిధులు యెండూరి నాగేశ్వరరావు, వరదా సూరిబాబు, అప్పన వీరన్న, నంబూరి సత్యానారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీబీఎస్ సంబరాలు



గ్రూప్ ఫొటో దిగిన చర్చి పాస్టర్లు, పిల్లలు

అమలాపురం టౌన్: స్థానిక మన్నా చర్చ్‌లో నాలుగు రోజులుగా హైదరాబాద్ వెకేషన్ బైబిల్ స్కూలు (వీబీఎస్) ఆధ్వర్యంలో పిల్లలకు పలు ఈవెంట్లలో సంబరాలు జరిగాయి. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన బ్రదర్ సురేష్ బృందం పిల్లలకు చక్కని పాటలు, డ్యాన్సులు, నాటికలు, పప్పెట్ షోలు, బైబిల్ వాక్యాలు చెప్పడం, కథలు చెప్పడం వంటివి నేర్పించారు. చర్చ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రదర్శనలో పిల్లలు బౌన్సర్, జంపింగ్ తదితర వినోద కార్యక్రమాల్లో పాల్గొని అల్లరి చేశారు. మన్నా జూబ్లీ చర్చి రెవరెండ్ కార్ల్ షారోన్ కొమానపల్లి, లీడ్ పాస్టర్స్ ఎర్నెస్ట్, ఎస్తేర్ తాతపూడి, సంఘ పెద్దల సమక్షంలో పిల్లలను ఆశీర్వదించి ప్రార్థనలు చేశారు. ముగింపు సందర్భంగా పిల్లలతో ఫొటో తమ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం సాధించి బహుమతి అందుకుంటున్న నాగస్వాతిశ్రీ

యానాం: పుదుచ్చేరిలో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్–2025లో స్థానిక విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని సోమవారం నిర్వాహక కార్యదర్శి వి.సన్యాసిరావు, ఇన్‌చార్జి ఎస్‌టీపీపీ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుడు పీవీఎస్ ప్రకాష్, కోచ్ పాము సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అండర్–14 బాలుర విభాగంలో 100, 200 మీటర్ల పరుగుపందెం పోటీల్లో మంచాల భార్గవ్ ప్రథమస్థానాన్ని , అండర్–14 బాలికల విభాగంలో వంద మీటర్ల పందెంలో తృతీయ, లాంగ్‌జంప్‌లో తృతీయ స్థానాన్ని దోమ స్వామి, అండర్–14 బాలికల విభాగంలో హైజంప్‌లో తృతీయ స్థానాన్ని చోడి మౌనిక, అండర్–19 బాలికల విభాగంలో 100, 200, 400 మీటర్ల పరుగుపోటీల్లో ప్రథమ స్థానాన్ని ఒగ్గు నాగ స్వాతిశ్రీ సాధించారన్నారు. అలాగే బాల్‌బాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి ప్రథమ స్థానాన్ని సాధించారన్నారు. కార్యక్రమంలో పీఈటీలు కె.రమేష్, కె.భాస్కర్, జె.చంద్రశేఖర్, వి.వరప్రసాద్, ఎస్.విష్ణు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానానికి వెంకటాయపాలేనికి చెందిన మేక సత్యనారాయణచౌదరి, జయభారతి దంపతులు సోమవారం రూ.12 వేల విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేద మంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అలాగే తాడేపల్లిగూడునికి చెందిన గుండు నవీన్‌కుమార్ కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళం అందజేశారు.

వ్యవసాయానికి రారూ..!

- కూలీలను వేడుకుంటున్న అన్నదాతలు
- ఉపాధి పనులుండగా రాని పరిస్థితి
- వాతావరణ హెచ్చరికలతో రైతుల బెంబేలు
- సహకరించాలని అధికారులకు విన్నపం



కోతలకు సిద్ధంగా ఉన్న వరి చేలు



డ్రెయిన్ పొడవునా తుప్పలను తొలగిస్తున్న ఉపాధి కూలీలు

అల్లవరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల వారికి ఉపాధి కల్పించి, వారికి ఆర్థిక పరిపుష్టి కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకం రైతుల పాలిట శాపంగా మారింది. కాయ కష్టంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఒబ్బిడి చేసుకోవడానికి రైతులు నానాయాతన పడాల్సి వస్తోంది వస్తుంది. ఉపాధి పథకం ద్వారా ప్రతి గ్రామంలో కాలువల్లో పూడిక తీతలు, పంట బోదెలు, పంచాయతీ చెరువుల్లో పూడికతీతలు ముమ్మరంగా చేపట్టారు. ఈ పనులకు కూలీలు వెళ్లిపోతుండడంతో వ్యవసాయ పనులకు వారి కొరత ఏర్పడింది. దీంతో సన్న, చిన్నకారు రైతులు పంటను ఒబ్బిడి చేసుకోవడానికి తీవ్ర ప్రయాసలు పడాల్సి వస్తోంది. ఉపాధి పనులు నిర్వహిస్తున్న గ్రామాల్లో వరి కోతలకు ఉపాధి కూలీలు రావడం లేదు. బతిమాలుతున్నా కూలీలు రాని పరిస్థితి నెలకొంది. ఉపాధి పనులకు అలవాటుపడిన కూలీలు వ్యవసాయ పనులంటే బాబోయ్ అంటున్నారు.

నియోజకవర్గంలో అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం రూరల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా చేపట్టడంతో హార్వెస్టింగ్ యంత్రాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో అనుకున్న సయయానికి పంట కోత జరగక రైతులు ఇబ్బందిపడుతున్నారు. మే మొదటి వారంలో కోనసీమ జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణం శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో పనులకు ఉపాధి కూలీలు రాక, ప్రకృతి సహకరించక రైతు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

ఉపాధి అధికారులు కూలీలపై ఉన్న శ్రద్ధ రైతులపై చూపడం లేదు. ఏటా ఏప్రిల్ మొదటి వారంలో ఉపాధి పనులు ప్రారంభి జూన్, జూలై చివర వరకు పనులు నిర్వహిస్తున్నారు. ఉపాధి పనులు నిర్వహించనంత కాలం వ్యవసాయ పనులకు ఉపాధి కూలీలు రావడం లేదు. రైతులు అధిక కూలీ ఇస్తామన్నా వ్యవసాయ పనులకు కూలీలు మొగ్గు చూపడం లేదు. ఉపాధి హామీ పథకాన్ని రైతాంగానికి అనుసంధానం చేస్తే రైతులకు ఖర్చులు తగ్గి నష్టపోకుండా ఉంటారని రైతుల ఎప్పటి నుంచో ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యవసాయ పనుల సమయాల్లో ఉపాధి పనులకు తాత్కాలికంగా విరామం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పొలం పనులకు ఆదేశాలిచ్చాం



వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్న గ్రామాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిసెంట్లు సమన్వయం చేసుకుని రైతులకు ఏలాంటి ఇబ్బంది రాకుండా పొలం పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. ఆ దిశగా చర్యలు తీసుకుంటాం.

– బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్, ఎంపీడీఓ, అల్లవరం

కూలీలు రావడం లేదు



ఉప్పలగుప్తం గ్రామంలో 15 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. పండిన పంటను ఒబ్బిడి చేసుకుందామంటే కూలీలు రావడం లేదు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రతిసారీ కూలీలు వ్యవసాయ పనులకు రావడం లేదు. ఈ లోగా వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు కురిస్తే ఇక రైతు పరిస్థితి అంతే. అనుకున్న సమయానికి వరి కోత యంత్రాలు వస్తే రైతు గట్టెక్కుతాడు. యంత్రాలతో కోతలు చేస్తే పశువులకు ఎండి గడ్డి కొరత ఎర్పడుతుంది.

– జి.నవీన్, ఉప్పలగుప్తం

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



తరగతుల విశిష్టతను విద్యార్థులకు వివరిస్తున్న హెచ్‌ఎం కామేశ్వరరావు

అమలాపురం టౌన్: స్థానిక ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి పాఠశాలల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. 40 రోజుల పాటు ఈ తరగుతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్ కృష్ణవర్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బీఆర్ కామేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ నిర్వహించే తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజ్ఞానాన్ని పెంపొందించే కథలు చెప్పడం, చదివించడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం వంటి అంశాల్లో అవగాహన పెంచుకుని శిక్షణ పొందాలని పేర్కొన్నారు. ఈ 40 రోజులూ సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి, విహార యాత్రలకు, బంధువుల ఇళ్లకు వెళదాం అనే ఆలోచనలను పక్కన పెట్టి గ్రంథాలయం ద్వారా విజ్ఞానాన్ని సముపార్జించాలని సూచించారు. గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతూ నిపుణులు నేర్పే పలు ఆటల పోటీలను సైతం ఆకళింపు చేసుకుంటూ ఈ సెలవులను గడపాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కామేశ్వరరావు విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల విశిష్టత, ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ సిబ్బంది పోలిశెట్టి సత్యనారాయణమూర్తితో పాటు పట్టణం, పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు, వంతెన నిర్మించాలి



ఉప్పలగుప్తంలో అర్జీ అందజేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి, గ్రామస్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి పంచాయతీ పరిధి గోకనవిల్లిలో ప్రాంతం నుంచి గ్రామ పంచాయతీకు రావడానికి కొన్నేళ్లుగా ఇబ్బంది పడుతున్నామని, అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి పీజీఆర్ఎస్‌లో సోమవారం మండల కార్యాలయ ఏవో ఎం.మూర్తికి సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ద్వారా ఫిర్యాదు పత్రాన్ని అందించారు. విలసవిల్లి పంచాయతీ పరిధిలోని గోకనవిల్లి గ్రామానికి 7 కిలో మీటర్ల దూరంలో ఉందని, గ్రామస్తులు ఏదైనా పంచాయతీ కార్యాలయ నిమిత్తం, రేషన్ నిమిత్తం రావాలంటే సుదూర ప్రాంతాల నుంచి రావాల్సి ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. విలసవిల్లి, గోకనవిల్లి మధ్య ఉన్న మురుగు కాలువపై వంతెన నిర్మించి రోడ్డు ఏర్పాటు చేస్తే పంచాయతీ కార్యాలయానికి కిలో మీటరు మాత్రమే ప్రయాణించే వెసులుబాటు కలుగుతుందని వినతిలో పేర్కొన్నారు. 70 కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ముషిణి లింగేశ్వరరావు, ముషిణి రాంబాబు, జంగా నాగమణి పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రభాకర్

అమలాపురం రూరల్: భగవాన్ శ్రీసత్య సాయి శతవర్ష జన్మోత్సవం సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మండలం భట్నవిల్లిలో ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే బాలవికాస్, సత్య సాయి అష్టోత్తరపూజ, భజన నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల అందజేత



పవర్ టిల్లర్లు అందజేస్తున్న ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు

ఐ.పోలవరం: నియోజకవర్గం పరిధిలో ఎంపిక చేసిన రైతులకు సోమవారం మురమళ్లలోని తన క్యాంపు కార్యాలయం వద్ద పవర్ టిలర్లు, రాయితీపై పచ్చిరొట్ట ఎరువులను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అందజేశారు. ఐ.పోలవరం, ముమ్మిడివరం మండలాల పరిధిలో రైతులకు నాలుగు చొప్పున, కాట్రేనికోన మండలంలో మూడు చొప్పున మొత్తం 11 పవర్ టిల్లర్లను అందజేశారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఆకాశం శ్రీనివాస్, పిన్నమరాజు శివ, సాగిరాజు సూరిబాబు రాజు, ఏవోలు ఎం.వాణి, ఎస్.ప్రశాంత్ కుమార్, కె.ప్రవీణ్ కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీ బేసిక్ టైలరింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఎమ్మెల్యే సుబ్బరాజు సోమవారం ప్రారంభించారు. మండలం కేశనకుర్రులోని స్త్రీ శక్తి భవనంలో దీనిని ఏర్పాటు చేసి మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ, ఈబీసీ, కాపు సామాజిక వర్గాల మహిళలకు ప్రభుత్వం ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అలాగే కుట్టు మెషీన్లు కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో సాగిరాజు సూరిబాబు రాజు, బేర సత్యకుమారి, వనచర్ల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

తాళ్లరేవు: ప్రభుత్వం అందజేస్తున్న వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు 16 మంది రైతులకు అందజేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సుబ్బరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మండలానికి 30 పవర్ టిల్లర్లు మంజూరు కాగా తొలివిడతగా ఏడుగురికి రూ.లక్ష సబ్సిడీతో అందజేశారు. అలాగే 8 మందికి బ్యాటరీ స్ప్రేయర్లు, ఒక రైతుకు పవర్ స్ప్రేయర్‌ను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, వ్యవసాయ శాఖ ఏడీ బాబూరావు, ఏఓ ఎస్.ప్రశాంతి, వైస్ ఎంపీపీ డి.నాగేంద్రప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో పరిమితులు తొలగించాలి



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర కిసాన్ సెల్ చైర్మన్ ప్రభాకరరావు

అమలాపురం రూరల్: రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు అవస్థలు పడుతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ చైర్మన్ కామన ప్రభాకరరావు కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వివరించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు ఆయన వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 1.60 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయగా ఆరు లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, ప్రభుత్వం రెండు లక్షల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలని లక్ష్యం విధించడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ప్రభాకరరావు పేర్కొన్నారు. లక్ష్యాల పరిమితులను తొలగించి పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వివరించారు. కాగా జిల్లాకు అదనంగా మరో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం అంగీకరించిందని రెండు రోజులలో ఆర్డర్లు వస్తాయని కలెక్టర్ ఆయనకు తెలిపారు. అలాగే జిల్లాలో మురుగు కాలువలు తవ్వడానికి రూ.15 కోట్లు మంజూరు చేస్తామని వచ్చే నెలలో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు యార్లగడ్డ రవీంద్ర పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ అధికారులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

అమలాపురం రూరల్: జిల్లా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తమకు జీతాలు సరిగా ఇవ్వడం లేదని ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.మమత జ్యోతి, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఎ.సాయి శంకర్, జిల్లా కార్యదర్శి కె.సాయి తేజ అధ్వర్యంలో ఈ ఆందోళన చేపట్టారు. నిబంధన ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని తదితర డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో బి.శివ, టి.మనోహర్, జల్లి, వెంకటేష్ , సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

మేడే ఘనంగా నిర్వహించాలి



ఐ.పోలవరంలో సమావేశమైన సీఐటీయూ నాయకులు

ఐ.పోలవరం: కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సోమవారం ఆయన ఇక్కడ సమావేశమై మాట్లాడుతూ నాటి పోరాట ఫలితంగానే ఈ రోజు మనకు హక్కులు, చట్టాలు సాధించామన్నారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. మే ఒకటో తేదీ ఉదయం 9 గంటల లోపు సంఘాల వారీగా జెండాలు ఆవిష్కరించి ఐ.పోలవరం సెంటర్‌కు రావాలన్నారు. కార్యక్రమంలో ఇళ్ల సూరిబాబు, రత్నం, అనంత లక్ష్మి పాల్గొన్నారు.

యానాం: స్థానిక టాక్సీస్టాండ్ వద్ద వివిధ ప్రజాసంఘాలు, కార్మిక నాయకులతో మేడే నిర్వహణపై దుర్గాప్రసాద్ చర్చించి ఉదయం 9 గంటల నుంచి కార్మిక జెండాల ఆవిష్కరణ, అనంతరం భారీ మేడే ప్రదర్శన ఉంటుందన్నారు. సమావేశంలో రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు సబ్బతి రాంబాబు, తిరుకోటి శ్రీనివాసరావు, దాసరి రాజు, లారీవర్కర్స్ యూనియన్‌నాయకులు గిడ్ల ఏసు, తాళ్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ



తాళ్లరేవులో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

తాళ్లరేవు: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా తాళ్లరేవులో సోమవారం రాత్రి క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. తాళ్లరేవ మండల, యానాం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఫెలోషిప్ అధ్యక్షుడు, తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ ర్యాలీని ప్రారంభించారు. స్థానిక సంతపేట సెంటర్ నుంచి వెంకటేశ్వరస్వామి గుడి, చెరువుగట్టు సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు అనేక మంది కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. శామ్యూల్ సాగర్ మాట్లాడుతూ ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మృతులకు నివాళులర్పించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఫెలోషిప్ కార్యదర్శి సాల్మన్‌రాజు, కోశాధికారి జాన్ ప్రసాద్, పాస్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

యానాం: ఉగ్రదాడికి నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో యానాంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి జి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మృతులకు నివాళులర్పించారు.

నేడు చిట్టబ్బాయి వర్ధంతి

అమలాపురం టౌన్: స్థానిక మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత దివంగత కుడుపూడి చిట్టబ్బాయి నాలుగో వర్ధంతికి పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 9 గంటలకు అమలాపురం హైస్కూలు సెంటర్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు చేరుకోవాలని సూచించారు. అక్కడ నుంచి పాదయాత్రతో స్థానిక గడియారం స్తంభం సమీపంలో గల దివంగత చిట్టబ్బాయి విగ్రహం వద్దకు వెళ్లి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. దివంగత చిట్టబ్బాయి కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కుడుపూడి భరత్ భూషణ్, రాష్ట్ర దృశ్య కళల అకాడమి మాజీ చైర్‌పర్సన్ సత్య శైలజ, చిట్టబ్బాయి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగనున్నట్టు ఆయన తెలిపారు.

పుస్తక పఠనం అలవరచుకోవాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న సర్పంచ్ చిన్నవరాజు

ఉప్పలగుప్తం: విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేసుకోకుండా స్థానికంగా ఉన్న గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవరుచుకోవాలని సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, పెయ్యిల రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని ఉప్పలగుప్తం, భీమనపల్లి గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రంథాలయ అధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషబాబు సర్పంచ్‌లచే జ్యోతి ప్రజ్వలన చేయించి తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దేశంశెట్టి నాగరత్నకుమారి, కంకటాల రాంబాబు, చిక్కం పెద్దబ్బులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ముమ్మిడివరం: అగ్ని ప్రమాదంలో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సోమవారం పరామర్శించారు. మండలంలో బలుసులంకలో జరిగిన అగ్నిప్రమాదంలో చిన్నం ప్రసాదరావు, చెందిన తాటాకిల్లు దగ్ధమై సుమారు రూ.ఆరు లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను ఎమ్మెల్యే పరామర్శించి సాయం అందజేశారు.

ప్రమాద బీమా అందజేత

యానాం: ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం ద్వారా యానాం పట్టణ పరిధిలో అగ్రహారానికి చెందిన కొల్లు వీర్రాజుకు సంబంధించి పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా మంజూరైన రూ.5లక్షలు సోమవారం ఆర్ఏఓ మునిస్వామి బాధితుని భార్య నాగరత్నంకు అందజేశారు. ఈ ఏడాది ఆగస్టు 15న అగ్రహారంలోని తన ఇంటి వద్ద విద్యుదాఘాతానికి గురై వీర్రాజు మృతిచెందడంతో ఈ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ గొంతియ్య తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి ఉచిత వాలీబాల్ శిక్షణ

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలోని ప్రతిభ గల క్రీడాకారులకు తూర్పుపాలెం అడబాల స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మే 8, 2025 నుంచి జూన్ 8, 2025 వరకు వాలీబాల్ క్రీడలో ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్, కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సౌజన్యంతో జాతీయ వాలీబాల్ క్రీడాకారులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల సహకారంతో 10 నుంచి 18 సంవత్సరాల బాలబాలికలకు శిక్షణ తరగతులను ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తారు. ఆసక్తి గల బాల బాలికలు మే 5 2025 లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు ఫోన్ నంబర్ 9392447443ను సంప్రదించాలని నిర్వాహకుల తరపున అడబాల వేణుగోపాల్ తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: పది పరీక్షల అనంతరం విద్యార్థుల కెరీర్ కోసం వారు ఎంచుకునే రంగాలకు అణుగుణంగా ఇచ్చే శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కాండ్రేగుల వెంకటేశ్వరరావు, రాష్ట్ర పీఆర్‌టీయూ అధ్యక్షుడు చొల్లంగి కేశవ రమేష్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ఫ్రీ కోచింగ్ సెంటర్ సోమవారంతో ముగిసింది. వారు మాట్లాడుతూ శిక్షణలో ఇచ్చిన మెళకువలను విద్యార్థులు ఆకళింపు చేసుకుని విజయం సాధించాలన్నారు. నెల రోజుల పాటు విద్యార్థులకు పాలిటెక్నిక్ కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బెహరా మూర్తి, సత్యానారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డెంగీ, మలేరియా లక్షణాలు కలిగి ఉన్నవారిని గుర్తించి వారి వివరాలను సేకరించడంతో పాటు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అలాగే ఇంటింటా జ్వర పీడితుల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. అంతకుముందు ఆస్పత్రిలో ఉన్న ల్యాబ్‌ను, రికార్డులను పరిశీలించారు.